## క్లుప్తంగా

### జిల్లాలో 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ అమలు

**కామారెడ్డి క్రైం:** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నెలాఖరు వరకు జిల్లాలో 30, 30 (ఏ) పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

### పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డిలో పారిశుద్ధ్యం లోపించకుండా తగిన చర్యలను తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలో చెత్త తొలగింపు, వర్షాల వల్ల కూలిన ఇండ్లకు సంబంధించిన మట్టి తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, మురికి నీరు నిలవకుండా చర్యలను తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

### యూరియాను మితంగా వాడాలి

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** రసాయన ఎరువులైన యూరియా తగిన మోతాదులో వాడాలని ఏఈవో శ్రావణ్ కుమార్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటల రక్షణలో రైతులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంటలను వేసుకునే ముందు విత్తనాల రకాలు, విత్తన మోతాదు, విత్తన శుద్ధి తదితర అంశాలపై సమగ్ర చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కజొన్నపంటలో కత్తెర పురుగు, వేరుకుళ్లు, వడలు తెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వ్యవసాయ అధికారుల సలహా మేరకు పంటలకు మందులను పిచికారీ చేయాలని సూచించారు. పంటల రక్షణలో రైతులు మెలకువలు పాటించాలన్నారు.

### వెలగని వీధి దీపాలు



**భిక్కనూరు:** దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం స్వాగత తోరణం వద్ద వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రి పూట దేవాలయం నుంచి మండల కేంద్రంలోనికి వచ్చేవారు, ఆలయం వైపు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

### ఆర్థిక సాయం అందజేత



**దోమకొండ:** సంగమేశ్వర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందిన గోత్రాల బాలరాజు కుటుంబానికి ఆదివారం మండల వ్యవసాయాధికారి మణిదీపిక రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇతర మండలాలు, జిల్లాలలో తోటి వ్యవసాయ శాఖ అధికారులుగా పనిచేస్తున్న 30 మంది కలిసి ఆర్థిక సహాయంగా వీరి కుటుంబానికి అందజేసినట్లు వివరించారు. మృతుడి పిల్లలకు చదువు నిమిత్తం కావలసిన అవసరాలుంటే తమను సంప్రదించాలన్నారు. మృతుడి భార్య రూప, కుమారులు రుత్విక్, సాకేత్‌లను ఆమె ఓదార్చారు.

### మాజీ ఎమ్మెల్యే రూ.10 వేల సాయం



**రాజంపేట:** రాజంపేటలో వరదల కారణంగా గోడకూలి చనిపోయిన యువ డాక్టర్ వినయ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందించిన ఆదివారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. సీనియర్ నాయకులు నల్లవెల్లి అశోక్, మాజీ ఎంపీపీ నీరడి శంకర్, క్రిష్ణ మూర్తి, మోహన్ రెడ్డి, చింతల స్వామి, మల్లగారి బాలయ్య, పిట్ల స్వామి పాల్గొన్నారు.



దోంగ్లీ వద్ద రహదారికి కొనసాగుతున్న మరమ్మతులు



గండిమాసానిపేటలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డి- ఎల్లారెడ్డి రహదారిలో పాముల వాగు వద్ద రోడ్డు పునరుద్ధరణ

# కొనసాగుతున్న మరమ్మతులు

**భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మరమ్మతులు చేయిస్తున్నారు.** యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. చాలా చోట్ల రోడ్లు కోతకు గురి కావడంతో రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెల్సిందే. వర్షంతో పాటు వరద తగ్గడంతో మరమ్మతులు చేయడానికి అవకాశం కలిగింది. లింగంపేటలో జరుగుతున్న మరమ్మతులను ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. అలాగే పలు చోట్ల అధికారులు మరమ్మతులను పర్యవేక్షిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సజ్జన్‌పల్లి శివారులో వంతెన మరమ్మతులు పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి



వాజిద్‌నగర్‌లో మొరం వేయిస్తున్న నాయకులు



నాగిరెడ్డిపేట: జిల్లా సరిహద్దులోని పోచారం వద్ద జాతీయ రహదారికి మరమ్మతులు

## తెగిన రోడ్డు.. రాకపోకలు బంద్

**దోమకొండ:** ముత్యంపేట నుంచి మాచారెడ్డి మండలం భవానిపేటకు వెళ్లే రోడ్డు ఆదివారం తెగిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు తెగిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై కల్వర్టు వద్ద వర్షపు నీరు నిలువగా, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నీటిని తొలగించే క్రమంలో జేసీబీతో కొంత మట్టిని తొలగించినట్లు తెలిసింది. దీంతో వరద ఉధృతికి కల్వర్టుతో సహా రోడ్డు కొట్టుకుపోయిందన్నారు. ఈ విషయంపై గ్రామస్తులు ఆ వ్యక్తులపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మొత్తంగా రోడ్డు తెగిపోగా, రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో భవానిపేట మీదుగా మాచారెడ్డి, కామారెడ్డికి వెళ్లే వారన్నారు. ప్రస్తుతం రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు ఈ మార్గం గుండా పూర్తిగా నిలిచిపోయాయి.



పూర్తిగా తెగిన ముత్యంపేట- భవానిపేట రోడ్డు

### ఇబ్బందుల్లో గిరిజన తండా ప్రజలు

**మాచారెడ్డి:** ఇటీవల కురిసిన వర్షాలకు పాల్వంచ మండలం ఎల్పుగొండ నుంచి గిరిజన తండాకు వెళ్లే రోడ్డు పూర్తిగా తెగిపోయింది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే తండావాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



కొట్టుకుపోయిన గిరిజన తండాకు వెళ్లే రోడ్డు

### ధ్వంసమైన బొల్లారం చెరువు అలుగు



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని బొల్లారం చెరువుకు సంబంధించి అలుగు ధ్వంసమైంది. ఫలితంగా మండలంలోని బెజుగంచెరువు తండాకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన భారీవర్షాలతో బొల్లారం చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారింది. చెరువు నుంచి వచ్చిన వరద నీటి ప్రవాహానికి అలుగు మధ్యభాగంలో ధ్వంస మై కిందికి కుంగిపోయింది. వరదనీరు తగ్గుము ఖం పట్టడంతో చెరువు అలుగు కుంగిన విషయాన్ని గుర్తించిన తండావాసులు స్థానికులను అప్రమత్తం చేశారు. దీంతోపాటు విషయాన్ని అధికారులతోపాటు మండల కాంగ్రెస్ నేతల దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డితోపాటు నాయకులు విక్రాంత్‌రెడ్డి తండాకు చేరుకుని ధ్వంసమైన చెరువు అలుగును పరిశీలించారు.

## పంట నష్టం వివరాల సేకరణ



కన్నాపూర్ చౌదరి చెరువు ఆయకట్టు కింద పంటలను పరిశీలిస్తున్న ఏవో అనిల్‌కుమార్



సంగోజీపేట్‌లో పంటనష్టాన్ని పరిశీలిస్తున్న దుద్దాల అంజిరెడ్డి

**లింగంపేట(ఎల్లారెడ్డి):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కన్నాపూర్, పొల్కంపేట శివారులోని చౌదరి చెరువు కట్ట తెగిపోయి పంటలు నీట మునిగాయి. ఆదివారం మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తన సిబ్బందితో కలిసి చెరువు ఆయకట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. నీట మునిగిన వరి, పత్తి పంటల వివరాలు, సర్వే నంబర్ల వారీగా రైతులను అడిగి సేకరించినట్లు తెలిపారు. సేకరించిన వివరాలు జిల్లా వ్యవసాయాధికారికి అందజేస్తామన్నారు. ఏఈవో రాకేష్, రైతులు పాల్గొన్నారు.

**బాన్సువాడ రూరల్ పరిధిలో..**

**బాన్సువాడ రూరల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు దుద్దాల అంజిరెడ్డి, షేక్ జుబేర్‌లు పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వంతో పోరాడి నష్టపరిహారం ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఎర్రవటి సాయిబాబా, మోచీ గణేష్, నాయిని మొగులయ్య, బోడచందర్ తదితరులున్నారు.

### ఎల్లారెడ్డికి ప్యాకేజీ ప్రకటించాలి



**లింగంపేట(ఎల్లారెడ్డి):** భారీ వర్షాల కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ విపత్తు సంభవించిందని.. ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, ఎమ్మెల్సీ బృందాన్ని కోరారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో వరదలతో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన ఎమ్మెల్సీ బృందాన్ని ఆయన కలిశారు. నష్టం వివరాలను వారికి తెలియజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సంజీవ్ ఉన్నారు.

### కొట్టుకుపోయిన భగీరథ పైపులైన్లు



**నిజాంసాగర్(జుక్కల్):** నిజాంసాగర్ ప్రాజెక్టు 20 గేట్ల ద్వారా నీటి విడుదల చేపట్టడంతో మిషన్ భగీరథ పైపులైన్లు కొట్టుకుపోయాయి. ఆరేపల్లి శివారులో మిషన్ భగీరథ పైపులైన్లు కొట్టుకుపోవడంతో నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని 35 గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. దీంతో తాగు నీటి కోసం ప్రజలు తిప్పలు పడుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహాలు తగ్గితే తప్ప భగీరథ పైపులైన్లకు మరమ్మతులు చేపట్టే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

## గుండ్ల కట్ట చెరువుకు బుంగ

- తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టిన జీపీ కార్మికులు

**దోమకొండ:** మండల కేంద్రం శివారులోని గుండ్ల కట్ట చెరువుకు ఆదివారం బుంగ పడింది. విషయం తెలిసిన రైతులు వెంటనే అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో గ్రామ పంచాయితీ కార్మికులు, గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు, మాజీ ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. గడ్డిని మట్టితో కలిపి వారు బుంగను నీరు లీకేజీ కాకుండా పూడ్చారు. గతంలోను ఈ చెరువు కట్టకు బుంగ పడగా, కట్ట తెగిపోయింది. దాదాపు 30 సంవత్సరాల క్రితం ఆకస్మాత్తుగా చెరువుకు బుంగ పడింది. దానిని పూడ్చే క్రమంలో కట్ట పూర్తిగా తెగిపోయింది. దీంతో చెరువు కట్ట కింద ఉన్న దాదాపు 500 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. తిరిగి మళ్లీ చెరువు కట్టకు బుంగ పడగా.. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకుని బుంగకు శాశ్వతంగా మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. స్థానిక నాయకులు అక్కడికి చేరుకుని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



దోమకొండ గుండ్ల చెరువుకు పడ్డ బుంగ వద్ద రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు

### ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించాలి



**బాన్సువాడ:** ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు నిర్వహించాలని సీఐ అశోక్ సూచించారు. ఆదివారం బాన్సువాడలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినాయక మండపం వద్ద ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మండపాల నిర్వహకులు రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దని సూచించారు.

### వర్షాలకు తీవ్రంగా పంట నష్టం



**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండలంలోని పలు గ్రామాలలో వేసిన పంటలు ఇటీవల కురిన భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. పత్తి, మొక్కజొన్న, సోయా, వరి పంటలతో పాటు కూరగాయలు, పప్పు దినుసులకు సంబంధించిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి పంట1,650 ఎకరాలు, మొక్కజొన్న 2,870, పత్తి పంట 1,045, సోయాపంట 580 ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. అధికారులతో దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

### బిక్కుబిక్కుమంటూ విధులకు..

**బాన్సువాడ రూరల్:** కొయ్యగుట్ట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని స్థానిక ఎస్టీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. గ్రామస్తులకు కార్యాలయాన్ని వేరే చోటికి మార్చాలని కోరినా వినిపించుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు భవనం నాణ్యత మరింత దిగజారిందని పంచాయతీ కార్యదర్శి రాహేలాబేగం అన్నారు. పై పెచ్చులు ఊడిపడుతాయనే భయంతో పిల్లర్ బీమ్ కింద కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పంచాయతీలో వివిధ పనులకు వచ్చే వారికి ప్రమాదం జరగకముందే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొయ్యగుట్టతండాలో పెచ్చులూడిన పైకప్పు కింద విధులు నిర్వహిస్తున్న రాహేలా బేగం

## సమాచారం..

### ప్రవేశాల గడువు పెంపు

**బాన్సువాడ రూరల్:** మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో ప్రవేశాల గడువును ఈ నెల 12 వరకు పెంచినట్లు అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీ సెంటర్‌లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలన్నారు. 2024-25లో ప్రవేశం పొందిన వారు రెన్యువల్ చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వివరాలకు www.braouon.line.in ను సంప్రదించాలని సూచించారు.

### రేపు బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** మండల కేంద్రం గోపాల్‌పేటలో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ఆర్యవైశ్యసంఘం కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు నల్లమడుగు సురేందర్, జనార్ధన్‌గౌడ్‌తోపాటు ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మంగలి యాదగిరి, వంశీగౌడ్, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్, దుర్గారెడ్డి, సంతోష్‌గౌడ్, రాజిరెడ్డి, నారాయణ తదితరులున్నారు.

### నేటి పెన్షన్ విద్రోహదినం విజయవంతం చేయాలి

**కామారెడ్డి అర్బన్:** సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.హన్మంత్‌రెడ్డి, విజయరామరాజులు వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. నిరసనలో పాల్గొనే వారందరూ ఉదయం 10గంటల వరకు నల్లచొక్కాలు ధరించి రావాలని కోరారు.

### అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కామారెడ్డి అర్బన్:** కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ బోధించడానికి ఆసక్తిగల, అర్హత గల అభ్యర్థుల నుంచి అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 2 సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, బీబీఏ, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ బోధించడానికి 5 ఖాళీలున్నాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 3న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

### నియోజకవర్గానికి రూ.200 కోట్లు ఇవ్వాలి

- సీఎం క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



యాచారంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** వర్షాల కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తీవ్రంగా పంట నష్టం జరిగిందని, దానికి ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉత్తునూర్, యాచారం, తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి తదితర గ్రామాల్లో వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను పరామర్శించారు. పంట నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి క్షేత్ర పర్యటన చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే రైతుల గోస అంటే ఏందో తెలుస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతులు తీవ్రమైన నష్టాన్ని చవిచూశారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింలు, రాజేశ్వర్ రావు, నాయకులు శ్రీను నాయక్, నాగాగౌడ్, గడీల భాస్కర్, సాయాగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**మొక్కలు నాటిన జైన సంఘం ప్రతినిధులు**

**కామారెడ్డి అర్బన్:** చాతుర్మాస్య ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ హితం కోసం ఆదివారం స్థానిక జైన సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జైన సంఘం మహిళా ప్రతినిధులు ప్రీతి, సురేఖ, కుమార్‌పాల్, ప్రదీప్ కుమార్ బోరా తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి**



**నిజాంసాగర్(జుక్కల్):** ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు తమ వంతు కృషి చేయాలని మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక పార్టీ అధిష్టానం చూసుకుంటుందన్నారు. నాయకులు రమేష్‌యాదవ్, లోక్యానాయక్, సవాయిసింగ్, నాగభూషణం గౌడ్, ఆకాష్, కాలిక్, గొట్టం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

**ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదానం**



**కామారెడ్డి అర్బన్:** జిల్లా కేంద్రంలో వరద బాధితులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఘనంగా జాతీయ రైతు దినోత్సవం**

**లింగంపేట(ఎల్లారెడ్డి):** శెట్పల్లి, పర్మళ్ల, ఆగపల్లితండా, తదితర గ్రామాల్లో ఆదివారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ఆధ్వర్యంలో శనివారం జెండా ఆవిష్కరించారు. వ్యవసాయం వృత్తి మాత్రమే కాదు సనాతన సంస్కృతని, దేశ ధాన్యాగారాన్ని నింపి ప్రజల ఆకలి తీరుస్తున్నది రైతులేనని నేతలు అన్నారు. ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధరలు ఇచ్చి ఆదుకోవాలన్నారు.

**ఊరూరా హెల్త్ క్యాంపులు**

**భిక్కనూరు:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది హెల్త్ క్యాంపులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యులు యెమిమా, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ సతీష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండలంలోని చందాపూర్, సోమారం గ్రామాలలో ఆదివారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బాధితులను గుర్తించి మందులు, మాత్రలను పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలను ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ సందర్శించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూదన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899